

నలుగురు ఆర్‌డిఒల నియామకం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లకు కొత్త ఆర్‌డిఒలు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్‌డిఎ సర్కారు ఏర్పడిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల, గ్రామీణ స్థాయి ఉద్యోగుల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా కడప ఆర్‌డిఒ పలపర్తి జాన్, బద్వేల్ ఆర్‌డిఒగా చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్‌డిఒగా ఆది మూలం సాయిశ్రీ, పులివెందుల ఆర్‌డిఒగా లక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష నియమితులయ్యారు.

వైద్యానికి..సుస్తీ!



- మందకొడిగా సూపర్‌స్పెషాలిటీ సేవలు
- పులివెందుల మెడికల్ కళాశాల సీట్లు గల్లంతేనా
- సిహెచ్‌సిల్లో వైద్యుల కొరతపై దృష్టి సారించాలి
- ఎంసెట్ కౌన్సెలింగ్...విద్యార్థుల్లో ఆందోళన
- నేడు జిల్లా సర్వజనాస్పత్రిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

జిల్లా వైద్య ఆరోగ్యరంగానికి సుస్తీ చేసింది. 2024-25 సంవత్సరంలో జిల్లాలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వైరల్ జ్వరాలతోపాటు డయేరియా పెద్దఎత్తున ప్రబలిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాలోని పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన సేవలు అందకపోవడంతో ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీయిస్తున్నారు. దీనికి తోడు జిల్లా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధునిక పరికరాల అమరిక దగ్గర నుంచి వైద్యుల నియామకం వంటి సమస్యలతో కునారిల్లుతోంది. ఇటీవల ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరైన వేలాది మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ ఎప్పుడు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితిలో కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ జిల్లా సర్వజనాస్పత్రి పరిశీలన నేపథ్యంలో కథనం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో వైద్యఆరోగ్యరంగం సమస్యలతో సతమతమవుతోంది. పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలు 50 మెడికల్ సీట్లు చొప్పున కోల్పోవడంపై పెద్దఎత్తున చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. 2024-25 అకడమిక్ ఇయర్‌లో పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల్లో మెడికల్ కోర్సులు నిర్వహించాలనే ఉద్దేశంతో గత వైసిపి సర్కారు పనులను ముమ్మరం చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో ఎన్డీయే సర్కారు పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలో మెడికల్ సీట్ల నిర్వహణపై చేతులు ఎత్తేయడం ఆందోళన కలిగించింది. రాష్ట్రప్రభుత్వ అసమర్థత ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలు అకడమిక్ ఇయర్ వాయిదా పడడం సర్కారు విమర్శల వర్షం కురుస్తోంది.

అధ్వానంగా సర్వజనుల సేవలు

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పర్యవేక్షణ అధ్వానంగా మారింది. రోజూ 1200 నుంచి 1600 మంది ఓపి రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. వీరికి వైద్యసేవలు ఎలా అందుతున్నాయో పరిశీలన చేయాలి. ఉదయం, సాయంత్రం సర్వజన ఆస్పత్రి నిర్వాహకులు రౌండ్లగా వారీగా పర్యవేక్షణ నిర్వహించడంలో లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఫలితంగా పలువురు వైద్యులు మధ్యాహ్నం లోపలే సొంత ఆస్పత్రులకు పరుగులు తీయడం పరిపాటిగా మారింది. గతంలో రిమ్స్ ప్రత్యేకాధికారి పని చేసిన ఐఎఎస్ అధికారి హయాంలో సాయంత్రం వరకు వైద్యులు విధులు నిర్వహించేవారు. సాయంత్రం వరకు ఓపి సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఇటువంటి ప్రస్తే లేకపోవడం గమనార్హం.



ఒపి కోసం క్యూలో వేచి ఉన్న రోగులు (ఫైల్‌ఫొటో)

మందకొడిగా సూపర్ స్పెషాలిటీ సేవలు

జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జిల్లా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో సుమారు రూ.60 కోట్లతో కూడిన ఆధునిక పరికరాలను కేటాయించింది. వీటిని ఏర్పాటు చేయడానికి సంబంధించిన టెక్నీషియన్లు లేకపోవడం, వైద్యపరీక్షలు నిలిపివేయడంతో సూపర్ సేవలు అందడం లేదు. దీనికి తోడు 11 విభాగాలకు చెందిన వైద్య సేవలు అందుతున్నట్లు కనిపించినప్పటికీ ఆచరణలో రెండు, మూడు విభాగాల సేవలు అందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో తొమ్మిది సిహెచ్‌సిల పనితీరు ఆశించిన రీతిలో కనిపించడం లేదు. బద్వేల్, పోరుమామిళ్ల పిహెచ్‌సిల్లో వైద్యుల కొరత పీడిస్తోంది. ఐదు నెలల కిందట ప్రభుత్వం ఎంసెట్ పరీక్షలు నిర్వహించింది. 2024-25 అకడమిక్ ఇయర్ ప్రారంభమైంది. కానీ ఇప్పటివరకు ఎంసెట్ రాసిన వేలాది మంది విద్యార్థులకు అడ్మిషన్లు అడ్మిషన్లు ఎప్పుడు ఉంటాయో తెలియడం లేదనే ఆందోళనలో ఉన్నారు.

1200 జిఎన్‌ఎంల ఆందోళన

రాష్ట్రంలో 2400 మంది ఎఎన్‌ఎంలు గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. వీరిలో 1200 మంది ఎఎన్‌ఎంలకు వైసిపి సర్కారు ఇన్ సర్వీస్ కింద జిఎన్‌ఎం కోర్సు పూర్తి చేసినట్లు గుర్తించి జిఎన్‌ఎంలు ప్రమోట్ చేసింది. తాజాగా ఎన్డీయే సర్కారు నేషనల్ నర్సింగ్ ఏజెన్సీ గుర్తింపు అవసరమనే నెపంతో నిలిపేయడంతో నర్సుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ఇటువంటి సమస్యలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ఏటా రూ.514 కోట్లు చెల్లింపులు
- ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి
- ట్రెజరీ డిడి ఎం.ఎస్. వెంకటేశ్వర్లు వెల్లడి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి



ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలి. దీంతోపాటు జిల్లాలోని డ్రాయింగ్ ఆఫీసర్లు తమ శాఖల పరిధిలోని అకౌంట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సిఎఫ్‌ఎంఎస్ అమలు నేపథ్యంలో ట్రెజరీ అధికారులపై అదనపు భారం పడింది. దీనికితోడు ఆర్టీసీ ఉద్యోగులు సైతం ట్రెజరీ పరిధిలోకి రావడంతో భారం రెట్టింపైంది. దీనికితోడు వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రభుత్వ పరిధిలో రానున్న నేపథ్యంలో మరింత భారంగా మారే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్న ట్రెజరీస్ డిడి ఎం.ఎస్ వెంకటేశ్వర్లుతో ప్రజాశక్తి ముఖాముఖి...

ట్రెజరీ కార్యాలయాల పనులేమిటి?

ముఖా ముఖి..

జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాలు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల చెల్లింపులు, వాటి రికార్డులను నిర్వహించడం, కొత్తగా చేరిన ఉద్యోగులకు ఐడి, ఇతర రికార్డులను నిర్వహించడం, పీడీ అకౌంట్ల నిర్వహణ, స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ, ఆప్కోస్, కాంట్రాక్టు, క్లాస్- 4 ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.

సబ్‌ట్రెజరీ కార్యాలయాల వివరాలు తెలపండి.

జిల్లాలో తొమ్మిది సబ్‌ట్రెజరీ కార్యాలయాలున్నాయి. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ముద్దనూరు, కమలాపురం, పులివెందుల, బద్వేల్, సిద్ధవటం, ప్రాంతాల్లో ఉన్నాయి.

ఇకెవైసి నమోదు ఎలా ఉంది?

ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా ఇకెవైసిపి చేయించుకోవాలి. ఇప్పటివరకు ఉద్యోగులు 99 శాతం, పెన్షనర్స్ 99 శాతం నమోదు చేశాం. కొత్తగా చేరిన ఉద్యోగులు సైతం ఇకెవైసిపి చేయించుకోవాలి.

ఉద్యోగుల వివరాలు తెలపండి?

జిల్లాలో 22 వేల మంది ఉద్యోగులు, 18 వేల మంది పెన్షనర్స్ ఉన్నారు. ప్రతి నెలా సదరు ఉద్యోగుల జీత భత్యాల, పెన్షన్స్, వంటి ఇతర చెల్లింపులు ప్రక్రియ నడుస్తోంది. వీటితోపాటు రిటైర్డు ఉద్యోగుల బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులను చేయడం గమనార్హం.

ట్రెజరీ చెల్లింపుల గురించి తెలపండి?

ప్రతిఏటా ట్రెజరీశాఖ ద్వారా రూ.514 కోట్లు మేర ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్లకు సంబందించి పెన్షన్ల రూపంలో చెల్లింపులు చేయడం జరుగుతోంది.

పీడీ అకౌంట్లు కలిగిన డిపార్టుమెంట్లు ఎన్ని?

జిల్లాలో 10 శాఖల వరకు ఉన్నారు. ఇందులో వైద్య ఆరోగ్య శాఖ, డ్వామా, స్పోర్ట్స్‌స్కూల్, యూనివర్శిటీ, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ సహా ఇతర శాఖల పరిధిలోని ఉద్యోగులు ఉన్నారు. వీటి పరిధిలోని ఉద్యోగులకు పిడీ అకౌంట్ల ద్వారా జీతభత్యాలు చెల్లింపులు చేయడం జరుగుతుంది.

ఆప్కోస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది?

ఆప్కోస్ కింద 3,600 మంది, ఔట్‌సోర్సింగ్ కింద 1100, కాంట్రాక్టు ఉద్యోగులు 2,000 మంది వరకు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

భూ మాఫియాను అరికట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలైన నాయనిపల్లె, కత్తెరగండ్ల, అక్కింగుండ్ల, సావిశెట్టిపల్లె, ఇటుకలపాడు, మూలపల్లెలలో ప్రభుత్వ భూములను అనర్హులు, స్థానికేతరులు కబ్జా చేసుకుని భూమాఫీయాను నడిపిస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకుని, భూమిని పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన నర్సాపురం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాటాడారు. భూ ఆక్రమణదారులు ఒక్కొక్కరు ఒక్కొక్క ఎస్టేట్స్ , ఫామ్ హౌస్‌లు ఏర్పాటు చేసుకొని వందల ఎకరాలు అక్రమంగా అనుభవించుకుంటున్నారని, అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. స్థానిక ఆయా గ్రామాలలోని పేదలు ఎకరం లేక రెండు ఎకరాలు చెట్టు పుట్ట రాయిరప్ప తొలగించుకొని అనుభవిస్తున్న భూములకు అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేయకుండా వారికి పట్టాలు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కూటమి టిడిపి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు గ్రామ గ్రామాన నిర్వహించి సమగ్ర భూపంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. గత అసైన్‌మెంట్ కమిటీలలో పూర్వం భూములు పొందిన లబ్ధిదారులకు సర్వే చేసి వారికి సబ్ డివిజన్ చేయకుండా దశాబ్దాలుగా వాయిదాలు వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం మండలంలో తీవ్రంగా ఉందని చెప్పారు. వెంటనే జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కబ్జాదారుల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ. రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు వి. అన్వేష్ పోరుమామిళ్ల మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, కాశినాయన మండల కమిటీ సభ్యులు వరికుంట్ల బాబు, నరసింహులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తోంది

వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తోందని, కూటమి ప్రభుత్వం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కాదని, ఇవిఎంల ద్వారా వచ్చిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. తిరుమలలో కల్తీ నెయ్యి అంటూ నిందలు వేయడం కాదని, చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే విచారణ కోరాలని పేర్కొన్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు అన్నారు. అందుకే ఆయన ప్రజల మందు దోషిగా నిలబడ్డారు అని తెలిపారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ పథకం అమలు చేయకపోయినా, సిఎం చంద్రబాబు వేల కోట్లు అప్పులు చేస్తున్నారని, వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 100 రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైన చంద్రబాబు, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ఆ దిశలోనే పవిత్రమైన టిటిడి ప్రతిష్టను సైతం దిగజారుస్తున్నారని ఆక్షేపించారు. తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగించారని ఆరోపిస్తున్న చంద్రబాబు, ఆ నెయ్యి తమ ప్రభుత్వ హయాంలోనే సరఫరా అయిందన్న విషయం మర్చిపోతున్నారని గుర్తు చేశారు. టిటిడి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వినియోగ దుష్ప్రచారం బెడిసి కొట్టి, ఆధారాలతో సహా ప్రజల ముందు దోషిగా నిలబడ్డ చంద్రబాబు, డైవర్షన్ కోసం జగన్‌గారి తిరుపతి పర్యటనపై రగడ సృష్టించారని చెప్పారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మౌనవ్రతం పాటిస్తున్నారని, విజయవాడ వరద బాధితులను కూడా ఆయన పరామర్శించలేదని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్ పాల్గొన్నారు.

బాలగొండ గంగాధర్‌కు పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి- కడప అర్బన్



అవార్డు అందుకుంటున్న గంధాధర్

రాష్ట్ర పర్యాటకశాఖ నుంచి 2024 సంవత్సరానికిగాను ఉత్తమ పర్యాటక రచయితగా కడపకు చెందిన చరిత్ర అధ్యాపకులు బాల గొండ గంగాధర్‌కు ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక సభలో ఆయన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ద్వారా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ గౌరవ అతిథిగా హాజరయ్యారు. గంగాధర్‌కు అవార్డు దక్కడం పట్ల జిల్లాకు చెందిన పలువురు పర్యాటకాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట కార్మికుల ఆందోళన

- సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆర్‌టిసిలోపనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పాత బస్టాండ్‌లో డ్రైవర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ (ఏపిపిటిడి)లో 25 సంవత్సరాల నుంచి 20 రకాల అవుట్ సోర్సింగ్ కార్మికులు, అద్దె బస్సు డ్రైవర్లు సుమారు 20,000 మంది ఉన్నారని తెలిపారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత వారు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని చెప్పారు. గత ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, అద్దె బస్సు కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదని విమర్శించారు. ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు గోవిందు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-చెన్నూరు : ఏకలవ్య ఫౌండేషన్ వారిచే 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ ఉచితంగా అందించినట్లు రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మన చుట్టూ ఉండే ఔషధ మొక్కలు వాటి ఉపయోగాలు, వంటల్లో ఉపయోగించే దినుసుల పేర్లు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం అనే అంశంపై ఈనెలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను ఏర్పాటు చేయండి సారూ..!

- కమ్మపాలెం గిరిజన కాలనీ వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - సిద్ధవటం : 'మా కాలనీలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి సొంత శ్మశాన వాటిక లేదు.. అధికారులు దయతలచి శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి సారూ..!' అంటతూ సిద్ధవటం మండలం కమ్మ పాలెం ఎస్‌టి యానాది కాలనీ వాసులు వేడుకుంటున్నారు. తమ గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి కూడా సొంత శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. తమ కాలనీలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని తీసుకొని ఏటిగడ్డన పూడ్చి పెట్టడానికి వెళ్లాలంటే జంగాలపల్లి , కమ్మ పాలెం మీదుగా వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని తీసుకుని తమ గ్రామాల మధ్య నుంచి తీసుకురావద్దని రెండు గ్రామాలకు చెందిన ప్రజలు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. ఈ విషయం గురించి పలుమార్లు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీకి శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు.

దక్షిణ కాలువ గండ్లు పూడ్చివేత

ప్రజాశక్తి -కమలాపురం టౌన్ : మైలవరం దక్షిణ కాలువ నుంచి కమలాపురం చెరువుకు నీటిని అందించాలనే లక్ష్యంతో కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు మైలవరం దక్షిణ కాలువకు పడ్డ గండ్లను నియోజకవర్గ రైతు అధ్యక్షుడు చాపాటి ప్రభాకర్ రెడ్డి ఆదివారం పూడ్చివేయించారు. దీని ద్వారా కమలాపురం చెరువుకు నీరు చేరడంతో పాటు ఆయకట్టు రైతులకు కూడా సాగు నీరు అందుతుందని, వర్షాలు లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్న కమలాపురం ప్రజలకు కూడా ఉపయోగపడుతుందని చాపాటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అంగనవాడీ, స్కీమ్ వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి, నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- గోపవరం

మండలంలోని మడకలవారిపల్లె దళితులపై దాడిచేసి,రేకుల షెడ్లు కూల్చి తీవ్ర నష్టం కలిగించిన వారిని తక్షణమే అరెస్ట్ కఠిన చర్యలు తీసుకోవాలని బద్వేలు దళిత గిరిజన జెఎసి అధ్యక్షులు ముత్యాలప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, కన్వీనర్ పిచ్చయ్య, ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకలవారిపల్లె పొలంలోసర్వే నెంబర్ 789,890లలో సుమారు 2 ఎకరాల 63 సెంట్లు భూమి దళితుడు రామకేసికి ఉందన్నారు. ఈ భూమిలో ఓ ముస్లిం వ్యక్తికి 60 సెంట్ల విక్రయించి, మిగిలిన భూమి తన ఆధీనంలో ఉంచుకొని అక్కడే రేకుల షెడ్లు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఈభూమిపైన అగ్రకులాలకు చెందిన తెలుగుదేశం, వైసిపికి చెందిన రామచంద్రారెడ్డి, ఆయన అల్లుడు మాజీ జడ్‌పిటిసి సభ్యులుసభ్యులు శశిధర్ రెడ్డిలు కన్నేసి ఆక్రమించే ప్రయత్నాలు చేశారని బాధితులు పిర్యాదు చేశారన్నారు. అర్ధరాత్రి మంది మార్బలంతో వాహనాలలో జనాలతో వచ్చి ఒక్క సారిగా దళితుల పైన దాడి చేసి రేకులషెడ్లు నేలమట్టం చేసి గాయప రిచారని వాపోయారు. వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేసి అరెస్టు చేసి జైలుకు పంపి దళితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ డివిజన్ దళిత గిరిజన జెఎసి కార్యదర్శి కైపు బాబు, ఉపాధ్యక్షుడు నారాయణ, బిసి సంఘం అధ్యక్షుడు గురుమూర్తి, ఎం చిన్న రాయుడు. అంబేద్కర్ సేన జిల్లా కో - కన్వీనర్ పుల్లూరు ఖాజావలి. జిల్లా కో- ఆర్డినేటర్, గంప శ్రీనివాసులు, బద్వేల్ కో- ఆర్డినేటర్ బొజ్జ రామ లక్ష్మయ్య, ఓబయ్య, బి జకరయ్య, కేశవ దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాలకొండల దర్శనం గొప్ప అనుభూతి

ప్రజాశక్తి - కడప



ఆటవిడుపుగా పాలకొండల్లో కలెక్టర్

కడప కొంగు సింగారాలను ఒలగబోస్తున్న పాలకొండలు, అక్కడి జలపాత సవ్వడులను, పక్షుల కిలకిల రావాలను, ఆస్వాదించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని, ఇది గొప్ప అవకాశంగా భావిస్తున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. ఆదివారం ఆటవిడుపులో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన కడప నగర శివారులోని పాలకొండలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ చుట్టూ పచ్చదనం, పాలకొండల ప్రకృతి రమణీయ దృశ్యాలు, తమకెంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించిందన్నారు. పాలకొండల జలపాతంలో తడవడం, తమ కుటుంబానికి ఆదివారం చక్కటి ఆటవిడుపులా గడిచిందన్నారు. పర్యాటకం వైపు ఆసక్తిని పెంచే సహజమైన అడవులు కడప జిల్లా సొంతం అన్నారు. కడప నగరానికి మూడు వైపులా నల్లమల అడవుల్లో భాగమైన కొండలు విస్తరించి ఉన్నాయన్నారు. పర్యటక ప్రియులను ఆకట్టుకునే ప్రకృతి వనరులు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయన్నారు. చూసే మనసుండాలే గానీ, చారిత్రాత్మక కట్టడాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు.. ఇలా కడప జిల్లాలో ప్రతీ రాయి, ప్రతి వాగు, వంక, చెట్టు చేమా.. అన్నీకూడా పర్యాటక సొగసులను అరబోసేవే అని వ్యాఖ్యనించారు.పర్యాటక ప్రియులు జిల్లాలో మనకు అందుబాటులో ఉన్న దర్శనీయ ప్రాంతాలను ఖచ్చితంగా చూడాలని పిలుపునిచ్చారు.


కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - బద్వేలు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవసనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి మూడు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేసే విధంగా ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చినటువంటి హామీలు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. సోమవారం బద్వేల్‌లో నిర్వహించబోయే ఆందోళనలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు ముడియం చిన్ని, సిఐటియు పట్టణ కన్వీనర్ పి.సి. కొండయ్య, బిల్లింగ్ వర్కర్ నాయకుడు రాయప్ప, విద్యుత్ నాయకులు అబ్దుల్, రఫీ, హుస్సేన్, దస్తగిరి, శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఖూన్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ తారిక్ అలీ ఆదివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు విజయవంతంగా చేస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య సహాయం, పరికరాలు అందించామని చెప్పారు. రక్తదాన శిబిరాలు, సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కెకెఆర్ స్థాపించిన 10 ఏళ్లల్లో 318 ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్స్, 231 రక్తదాన శిబిరాలు, 19,722 యూనిట్ల రక్తం దానం, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.



రక్తదానం చేస్తున్న తారిక్ అలీ

మెడికల్ కళాశాల సీట్లల్లో మాపైనే నిందలా?

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మెడికల్ కళాశాల సీట్ల విషయంలో తమపై నిందలు మోపుతున్నారని, వైసిపి పాలనలో మెడికల్ కళాశాలను నిర్మించారని, హాస్టల్ ఏర్పాటు చేయలేదని, అందువల్లే ప్రారంభించడానికి వీలు కాలేదని ఎపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పులివెందులకు వచ్చిన వైద్య శాఖ మంత్రికి బిజెపి జిల్లా అధ్యక్షులు శశి భూషణ్ రెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శశి భూషణ్ రెడ్డి నివాసానికి చేరుకొని అక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని అంటున్నారని ,ఎక్కడ చూసినా ప్రైమరీ హెల్త్ కేర్ కేంద్రాలు అధ్వాన పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎక్కడా కూడా సరైన వైద్యులు లేరు, నర్సింగ్ సిబ్బంది లేరని చెప్పారు. దొడ్డిదారిన అనుమతులు తీసుకొచ్చి మెడికల్ కళాశాలు నిర్మించారని ఆయన ఆరోపించారు. రాజమండ్రిలో 95 మంది స్పెషల్ బోధన సిబ్బందికి గాను కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారంటే ఏమాత్రం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు.

లింగాల వైద్యుడిపై చర్యలు తీసుకోండి

లింగాల ప్రాథమిక వైద్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ కళ్యాణ్ పై చర్యలు తీసుకోవాలని లింగాల ప్రజలు మంత్రి కి ఫిర్యాదు చేశారు. వైద్యులు విధులు సక్రమంగా నిర్వహించారని, వచ్చిన రోగులకు సరైన వైద్యం చేయరని మంత్రికి ఫిర్యాదు చేశారు. పైగా రోగులను దూరంగా ఉంచుతారని రోజుకు వంద మందికి పైగా ఆసుపత్రికి రోగులు రావడం వస్తుంటారని, వైద్యుని తీరుతో వారు చాలా బాధపడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఆయన స్పందిస్తూ డాక్టర్‌ను మార్చేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

మహోన్నత వ్యక్తి సిపి బ్రౌన్ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగు భాషను నేర్చుకుని ఎవరు చేయలేని సేవను చేసిన కారణజన్ముడు సి.పి.బ్రౌన్ అని కలెక్టర్ శివశంకర్ అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీయుడు అయినా తెలుగువారు మరచిపోకూడని మహోన్నత వ్యక్తి సి పి బ్రౌన్ అని కొనియాడారు. తెలుగు సాహిత్య అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆంగ్లేయుడు అని అన్నారు. సిపి బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. తెలుగు జాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లేయులలో ఒకరిగా సి పి బ్రౌన్‌ను పరిగణిస్తారని అన్నారు. మిగతా ముగ్గురు ఆర్థర్ కాటన్, కాలింగ్ మెకంజీ, థామస్ మన్రోలు అని అన్నారు. జిల్లాలో ఎంతోమంది మహానుభావులు పుట్టిన ప్రదేశమని సుమతి శతకం ఉద్భవించిన జిల్లా అని అన్నారు. వ్యక్తిగతంగా సుమతి శతకం అంటే తనకెంతో ఇష్టమని ఉన్నారు. గ్రంథాలయ నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి నిర్మాణ ఆలస్యానికి కారణములు తెలపాలన్నారు.

నడకతోనే గుండె పదిలం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నడకతోనే గుండె పదిలమని గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ వంశీధర్ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్‌కు గుండె సంబంధిత జబ్బులు, వాటి నివారణ, తీసుకవాల్సిన జాగ్రత్తల గురించి కళాశాల జంతుశాస్త్ర విభాగం, సర్.సి.వి.రామన్ సైన్స్ క్లబ్, జెవివి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సం సందర్భంగా ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులతోనే ఎక్కువ మంది మరణిస్తున్నారని పేర్కొన్నారు. వ్యాయామం, మితాహారంతోనే గుండె సంరక్షణ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీమాదవ్, గౌరవ సలహాదారులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవిశేఖర్, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ విశ్వనాథం, అపర్ణ, మహేష్, జెవివి నాయకులు శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కార్నియాలను నేత్ర వైద్య సిబ్బందికి అందిస్తున్న పురుషోత్తం కుటుంబసభ్యులు

ఆయన మరణించినా చూపు సజీవం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండలం పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాయపాటి పురుషోత్తం గుండెపోటుతో మరణించినా.. ఆయన చూపు సజీవమని స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్య క్షులు రాజు పేర్కొన్నారు. పురుషోత్తం తల్లిదండ్రులు వరలక్ష్మి, వెంకటరమణ, అన్న మురళి కృష్ణ, అంజి, రామనాథ్ నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం వారికి సమాచారమిచ్చారు. రాజు, టెక్నీషియన్ హరీష్ మృతుడి ఇంటి వద్దకు వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి విజయవాడలోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతున్న అంధులకు అమర్చడం ద్వారా వారికి చూపు వస్తుందన్నారు. ఈ బృహత్కార్యాన్ని ప్రతి కుటుంబం ఒక సంప్రదాయంగా అలవరచుకోవాలన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణిస్తే 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపారు.



డిప్యూటీ తహశీల్దార్ బి.తేజస్విని సన్మానిస్తున్న సభ్యులు

గౌతమ్ స్కూల్లో 'మానవత' సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఎర్రగుంట్ల యూనిట్ నెలవారీ సమావేశాన్ని స్థానిక గౌతమ్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం చైర్మన్ డి.రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎర్రగుంట్ల డిప్యూటీ తహశీల్దార్ బి తేజస్విని మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో మానవతా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై వివరించారు. అక్టోబర్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. గత నెలలో నాటిన మొక్కలు, వాటి పెంపకం, పెరుగుదలకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. మట్టి, ఎరువు తదితర వాటిని వేసేందుకు నిర్ణయించారు. మానవత సభ్యత్వ నమోదు కార్యక్రమం వెనుకబడి ఉన్నందున మరింత ఉత్తేజంగా చేసేందుకు నిర్ణయించారు. కనీసం 600 మందితో సభ్యత్వ నమోదు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన తేజస్విని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, కార్యదర్శి రంగయ్య, కల్లూరు గంగాధర్‌రెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రిటైర్ డిప్యూటీ డిఇఒ మునిరెడ్డి, టీచర్ ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వై.రాజారెడ్డి, తోట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సమావేశమైన మానవత, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని శాంతిరథం దాతలు యూఎస్ఎ జి.వెంకట రమణారెడ్డి సూచించారు. స్థానిక ఎస్సీప డిగ్రీ కళాశాలలో ఆదివారం బిటి నరసింహారెడ్డి అధ్యక్షతన మానవత సేవా సంస్థ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జి.వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షులు జి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో బ్లడ్ డోనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామని, దాతలు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, కార్యదర్శి ఓబులరెడ్డి, పార్థసారథి, గౌరవ సభ్యులు ఎం.శ్రీనివాసులు, గౌతమబోయిన గురుమూర్తి యాదవ్, సాదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సిఐ, నాయుడు కుటుంబ సభ్యులు

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో వేముల మండలం శేషన్నగారిపల్లెకు చెందిన ఓటికుంట నాయుడు ఏడవ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రూ.50 వేలు విలువ చేసే వస్తువులను వితరణ చేశారు. మంచికి మానవత్వానికి మారుపేరుగా వేముల మాజీ ఉప సర్పంచ్ ఓటికుంట నాయుడు నిలిచారని ట్రాఫిక్ సిఐ హాజీవలి పేర్కొన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిన్న కుమారుడు ఓజియన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి ఓటికుంట గంగాధర్ నాయుడు అభినందనీయులని పేర్కొన్నారు. దాత గంగాధర్ నాయుడు మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల అభ్యున్నతి కోసం తమవంతు సహాయం చేస్తామన్నారు. భవిష్యత్తులో వీరికి విద్య, ఉపాధి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఓటికుంట కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - పెద్దముడియం



పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దపసుపులలో స్థానిక కూటమి నాయకుడు శెట్టిపల్లె సుధాకర్ రెడ్డి రూ.12 లక్షల గ్రామ పంచాయితీ నిధులతో సీసీ రోడ్లు మొదలు పెట్టారు. చిన్నపాటి వర్షానికే మురికి కాలువలా కనిపించే వీధులు.. సీసీ రోడ్లుతో వీధులు సుందరంగా దర్శన మిస్తున్నాయి. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు కసరత్తు

ప్రజాశక్తి - చాపాడు

2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో గృహాలు మంజూరై వివిధ దశల్లో ఉన్న వాటికి 2019లో అధికారంలోకి వచ్చినవైసిపి ప్రభుత్వం వివిధ కారణాలతో బిల్లులు మంజూరు చేయలేదు. ఇలాంటి ఇళ్లను గుర్తించి వాటిని పూర్తి చేసి బిల్లులు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మన ఇల్లు-మన గౌరవం పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి పెండింగ్‌లో ఉన్న గృహాలను వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. చాపాడు మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలో 498 ఇళ్ల బిల్లులు మంజూరు కాక వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డి రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది, పెండింగ్ గృహాలపై చర్యలు చేపట్టారు. ప్రతిరోజు గ్రామాలకు వెళుతూ లబ్ధిదారులను కలిసి త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. బిల్లులు వెంటనే మంజూరవుతాయని, ఇళ్లను



బిల్లు మంజూరుకాక మదూరులో అసంపూర్తిగా ఉన్న గృహం

పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. లబ్ధిదారులు కూడా పెండింగ్ ఇళ్ల పనులు పూర్తి చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కడప జిల్లాపై సిఎం వివక్ష దుర్మార్గం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష కట్టడం దుర్మార్గమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 డిసెంబర్ 4న కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూ.250 కోట్లతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఈ కేంద్రాన్ని కడప జిల్లా నుండి అమరావతికి తరలిస్తూ 2024 సెప్టెంబర్ 24న చంద్రబాబు ప్రభుత్వం జీఓ జారీ చేయడం శోచనీయమన్నారు. కడప జిల్లా, రాయలసీమ ముందుగానే వెనుకబడిన ప్రాంతమన్నారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా నిరుద్యోగులు ఉన్నత శిక్షణ పొంది ఉద్యోగాలు పొందే అవకాశం కోల్పోయారని చెప్పారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ మెడికల్ కమిషన్ 2024 ఆగస్టు 16న అనుమతి పత్రం ఇచ్చిందని చెప్పారు. ఈ సీట్లు మాకొద్దు, ఈ కళాశాలను నిర్వహించలేమని చంద్రబాబు ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 10న నేషనల్ మెడికల్ కమిషన్‌కు లేఖ రాయడం సరైంది కాదన్నారు. దీంతో నేషనల్ మెడికల్ కమిషన్ ఇచ్చిన అనుమతి పత్రాన్ని ఉప సంహరించుకోవడం జరిగిందని చెప్పారు. ఇంతకంటే దారుణం మరొకటి ఉండ దన్నారు. దేవుడు వరం ఇవ్వగా పూజారి అడ్డుకున్నట్లుంది అన్నారు. కేంద్ర ఇవ్వగా రాష్ట్రం వద్దనడం విడ్డూరమన్నారు. చంద్రబాబు మంత్రి వర్గంలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమని చెప్పారు. రాష్ట్రంలో 26 జిల్లాలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం మంత్రి వర్గంలో ముఖ్యమంత్రితో సహా 26 మంది మంత్రులు ఉండవచ్చన్నారు. ఆ ప్రకారంగా కడప జిల్లాకు ఒక మంత్రి పదవి ఇవ్వొచ్చన్నారు. ఇప్పటికైనా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రా మికవాడ నుండి అమరావతికి తరలించే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో, సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు టిడిపి కూటమిని చిత్తుచిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెబుతారని తులసిరెడ్డి హెచ్చరించారు.

కార్యాలయం ఉన్నా.. అధికారులు ఉండరన్నా



తెరచుకోని నీటి పారుదల కార్యాలయం

పజాశక్తి - ఖాజీపేట

స్థానిక పీడబ్ల్యూడి బంగ్లా ఆవరణలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయం తెరుచుకొనక వృథాగా ఉంటోంది. ఈ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఎవరూ ఉండడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కేసీ కాలువల వెంబడి నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నీటిపారుదల శాఖ ఎఇ కూడా రైతులకు అందుబాటులో ఉండడం లేదని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. నీటి పారుదల శాఖ భవనం ఎప్పుడూ మూసే ఉంటుందని తెలుస్తోంది. కేసీ చివరి ఆయకట్టు ప్రాంతానికి సక్రమంగా నీరు అందడం లేదని, కాలువల వెంబడి కంపచెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నా పట్టించుకున్న దాఖలాల్లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉండాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి పారుదల శాఖ ఎఇ, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాస్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్ని రకాల నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని చెప్పారన్నారు. నేడు సామాన్యుడికి కుటుంబ పోషణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న పేద కుటుంబాలు, సామాన్యుడు తన కడుపు నింపుకోడానికి చాలా అగసాట్లు పడుతున్నాడన్నారు. నిత్యవసర సరుకుల ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సామాన్య ప్రజలకు పెనుభారంగా మారిందన్నారు. నిత్యవసర సరుకులు ధరలు తగ్గించి వారిని ఆదుకోవాలన్నారు. ఇప్పటికే బియ్యం 25కిలోల బస్తా రూ.1500 నుంచి రూ.1600 వరకు అమ్ముతున్నారు. వేరుశనగ, కందిపప్పు తదితర ధరలు



మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు

ఆకాశాన్నంటున్నాతయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరివిజయ్, హుస్సేన్, నరేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు క్లస్టర్‌లోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఆదివారం స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు. అనంతరం శివాలయం వీధి, టిబి రోడ్డు మీదుగా గాంధీ రోడ్డులోని మహాత్మ గాంధీ విగ్రహం వద్దకు చేరుకునా్రు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌బిఐ కడప రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని గత ఆదివారం కడపలో నిర్వహించామన్నారు. పరిసరాల శుభ్రత మన అందరి బాధ్యత అని మనం నివసించే ఇల్లు పనిచేసే కార్యాలయాలతోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉన్న చెత్తను తొలగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బిఐ ఉద్యోగులు



రోగితో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటచెంచయ్య

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అంతర్జాతీయ గుండె దినోత్సవం సం దర్భంగా స్థానిక ధ్రీతి ఆసుపత్రి ప్రథమ వార్షి కోత్సవాన్ని పుర స్కరిం చుకొని గుండె స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటచెంచయ్య, స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ అనూష వల్లంకొండ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 120 మందికి ఇసిజి, 55 మందికి 2డిఎకో గుండె స్కానింగ్ పరీక్షలు, 150 మందికి హెచ్‌బి శాతం, షుగర్ పరీక్షలు, స్త్రీల వ్యాధుల సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు యాంజియోగ్రాం, గుండెకు స్టంట్, పేస్‌మేకర్, కాన్పులకు ప్రత్యేక రాయితీ సదుపాయాన్ని కల్పించారు. ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన సూచనలిచ్చారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆకలి తీర్చే అన్నదానం గొప్పదని ప్రాణదాత సేవాసమితి సభ్యులు న్యాయవాది సుమంత్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎంవి రమణారెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఆయన కుమారుడు రాజారాం మోహన్‌రెడ్డి, సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ పేదులు, సాధువులు, వృద్ధులు, భిక్షాటనలో ఉన్నవారికి అన్నదానం చేశారు. బిక్షాటనలో ఉన్న వారికి అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో సేవాసమితి చైర్మన్ సునీల్‌కుమార్, నారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

కెసి కాలువపై ఏపుగా పెరిగిన కంపచెట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చాపాడు చానల్ పరిధిలో చిన్న వరదాయపల్లె గ్రామం వద్ద కెసి కాలువపై కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఆ మార్గాన ప్రయాణించే ప్రజలకు ఇబ్బందిగా తయారైంది. మదూరు పంచాయతీ పరిధిలోని చిన్న వరదాయపల్లె గ్రామ సమీపంలో కెసి కెనాల్ కాలువ ఉంది. ఈ కాలువ వెంబడి ఉన్న రోడ్డుపై ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే పశువులను మేత కోసం ఈ మార్గం వెంబడి పాడి రైతులు వెళుతుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా కాలువ కట్టపై కంపచెట్లు తొలగించకపోవడంతో ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా మారాయి. చాలా ప్రదేశాల్లో గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. కాలువకట్టపై కంపచెట్లను తొలగించి గుంతలు పడిన ప్రదేశంలో మరమ్మతులు చేపడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



చిన్న వరదాయపల్లె వద్ద కాలువ కట్టపై పెరిగిన కంపచెట్లు



ఎమ్మెల్సీకి విరాళాన్ని అందిస్తున్న గుడ్ మార్నింగ్ బ్యాచ్

అన్న క్యాంటీన్‌కు రూ.60 వేలు విరాళం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అన్న క్యాంటీన్‌కు పులివెందుల గుడ్ మార్నింగ్ బ్యాచ్ ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి తమవంతుగా రూ.60వేలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సహృదయంతో ఈ ప్రాంత అన్న క్యాంటీన్‌కు విరాళం ఇచ్చిన పులివెందుల గుడ్ మార్నింగ్ బ్యాచ్‌కు అభినందనలు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరికొంతమంది అన్నా క్యాంటీన్‌కు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. పేదవారి ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి సంకల్పంతో వచ్చారని, అందుకు దాతలు కూడా సహకరించాలని ఆయన కోరారు.



సిఎంకు చెక్కు అందిస్తున్న ప్రవీణ్ రెడ్డి

వరద బాధితులకు రూ.2.5 లక్షల సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విజయవాడ వరద బాధితుల సహాయారథం ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.2.5లక్షల విరాళం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన కుటుంబ సమేతంగా సిఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, పీడీలు

హ్యాండ్‌బాల్ పోటీలకు జడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఇటీవల వేంపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో సరిబాల ఆదిశేషారెడ్డి, అలవలపాడు విష్ణువర్ధన్, కంతూరి వెంకట శ్రీరామ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు అక్టోబర్ 3వ తేదీ నుంచి 7వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరం నాగూర్ గుళ్ళులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పోటీ పరీక్ష

ముద్దనూరు : కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ సంగమేశ్వర హైస్కూల్లో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై విద్యార్థులకు కాంపిటీటివ్ ఎగ్జామ్ నిర్వహించారు.ఆంగ్లం, తెలుగు, ఉర్దూ భాషల్లో పరీక్షలు నిర్వ హించారు. సీనియర్ గ్రూప్ జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి మొదటి బహుమతి రూ.12వేలు, రెండవ బహుమతి రూ.6వేలు, మూడవ బహుమతి రూ.3వేలు అందిస్తారన్నారు. జూనియర్ గ్రూప్‌లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి మొదటి బహుమతి రూ.6వేలు, రెండవ బహుమతి రూ.4వేలు, మూడవ బహుమతి రూ.2వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు 45 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, ముద్దనూరు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రమైన ఎఐటియుసి కార్యాలయంలో ఆ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సిపిఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ కార్డ్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా టిడిపి కూటమి నాయకులు చామల విష్ణువర్ధన్‌రెడ్డి విశ్రాంత ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యఅతిథులను భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ప్రజాశక్తి - దువ్వూరు



లారీ కింద పడిన శ్రావ్య

మండల కేంద్రమైన దువ్వూరు ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావ్య (19) మృతి చెందిందని ఎస్ఐ వినోద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెం దిన శ్రావ్య, ఆమె పెద్దనాన్న నారాయణ స్కూటర్‌పై వెంకుపల్లె గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న స్కూటర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమా దంలో ఇద్దరు గాయపడ్డారు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా.. అక్కడ చికిత్స పొందుతూ శ్రావ్య మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - సిద్ధవటం

మండల పరిధిలోని డేగనవారిపల్లి ప్రాంతాల్లో శనివారం రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆదివారం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పెన్నా నది పరివాహ ప్రాంతాల్లో తనిఖీలు చేశామన్నారు. ఈ దాడిలో ట్రాక్టర్లను. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.